

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## తీర్థయాత్ర

**"సీతా! ఏం చేస్తున్నావు?** నీ కోరిక తీర్చబోతున్నాను తెలుసా?" తలుపు తీసుకుని సుడిగాలిలా లోపలకి వచ్చాడు వాసు.

"ఏం కోరిక? సొంత ఇంటి కోరికా?" చదువుతున్న నవలని పక్కన పెట్టి ఆశగా అడిగింది సీత.

"అబ్బా! దానికింకా టైం వుంది కాని, ఓ చిన్న కోరిక తీర్చబోతున్నాను." వాసు ఊరించాడు.

"ఏమిటది?" ఉత్సాహంగా అడిగింది సీత.

"నువ్వు కోరుకున్న మధురై తీసుకెళ్ళబోతున్నాను" గర్వంగా చెప్పాడు.

"నేను మధురై చూడాలనుకున్నానా? ఎప్పుడు?" అయోమయంగా అడిగింది.

"అప్పుడెప్పుడో టి.విలో `అర్జున్` సినిమా చూస్తూ మధురై మీనాక్షి అమ్మవారిని చూడాలని ఉందని చెప్పలేదు?"

"కలిసుందాంరా చూసి స్విట్జర్లాండ్ చూడాలని ఉందని కూడా చెప్పాను" కోపంగా చెప్పింది సీత.

"ఇల్లు, స్విట్జర్లాండ్ లాంటి ఖరీదైన కోరికలు కోరకు తల్లీ. ఏదో చిన్న ఉద్యోగిని. ఇందాక ఇంటర్నెట్‌లో బ్రౌజ్ చేస్తూంటే, మధురై విమానం టిక్కెట్లతో పది శాతం ఆఫ్ అని చదివా. మనం ఎప్పుడూ విమానం ఎక్కలేదుగా? పదిహేనువేలు. రానూ పోనూ ఇద్దరికీ క్రెడిట్ కార్డ్‌తో కొనేసా"

"ఏమిటి? విమానమా? పదిశాతం ఆఫ్ అని కొన్నారా? పదిహేనువేలా?" నిర్ఘాంతపోయి అడిగింది సీత.

"అవును. శుక్రవారం రాత్రికి వెళ్తాం. ఆదివారం రాత్రి వచ్చేస్తాం. ఫ్లైట్‌లో వెళితే రెండురోజులు చాలు. అదే రైలైతే కనీసం వారం రోజులు కావాలి."

"అసలు మనది తీర్థయాత్రలు చేసే వయసా? ఉన్నది జాగ్రత్త పెట్టుకుని ఇల్లూ, వాకిలి కొనేవయసు. ఇంత దుబారా చేస్తే రేపు పిల్లలు పుట్టాక ఎంత కష్టమో తెలుసా?" కయ్‌మంది.

"అప్పటి సంగతి అప్పుడు చూసుకోవచ్చు. శుక్రవారం రాత్రి పదకొండుకి ఫ్లయిట్. బట్టలు సర్ది ఉంచు. చెరో పదిహేను కిలోలు లగేజ్ ఫ్రీట."

చిన్నగా నిట్టూర్చింది సీత.

ఏర్‌పోర్ట్ ఆవరణలో టేక్సీ దిగాక లోపలకి నడుస్తూ అడిగింది.

"ఎంతయింది?"

"ఆరువందల ఏభై."

"రాను, పోను టేక్సీ ఖర్చులతో రైల్లో మద్రాస్‌కి వెళ్ళిరావచ్చు" గొణిగింది.

"నీ మిడిల్ క్లాస్ లెక్కలు వేయద్దన్నానా?" కసిరాడు.

"అవును మీరు అంబానీ నేను మిసెస్ అంబానీ" సీత వెటకారంగా చెప్పింది.

"తల్లీ! దయచేసి మూడురోజులు ఏం మాట్లాడొద్దు" దణ్ణం పెట్టాడు వాసు.

మధురై ఏర్‌పోర్ట్ నించి బయటకి రాగానే 'మిస్టర్ అండ్ మిసెస్ వాసుదేవ్' అని రాసి ఉన్న అట్టని పట్టుకున్న డ్రైవర్ కనిపించాడు. వాసు అతని దగ్గరకి వెళ్ళి తనే వాసుదేవ్ అని ఐడి చూపించాడు.

ఇద్దరూ అతని వెనకే వెళ్ళి ఫార్చ్యూన్ పాండ్యన్ అన్న అక్షరాలు పెయింట్ చేసిన తెల్లటి వేన్‌లో కూర్చున్నారు. "ఏమండీ. యూనిఫాంలోని డ్రైవర్ వచ్చాడేంటి మనకోసం?" వాసు చెవిలో అడిగింది సీత.

"మనం బుక్ చేసిన హోటల్ వాళ్ళ కాంప్లిమెంటరీ సర్వీస్ ఇది. పికప్ డ్రాపింగ్ వాళ్ళే" విలాసంగా చెప్పాడు వాసు.

"కొంపతీసి ఫైవ్‌స్టార్ హోటల్ బుక్ చేసారా?" చిన్నగా అరిచింది

"అబ్బా! కాదులే త్రీస్టారే"

కారు ఫార్చ్యూన్ పాండ్యన్ ఆవరణలో ఆగింది. వాసు రిజర్వేషన్ నిర్ధారిస్తూ వాళ్ళు ఇచ్చిన ఇ మెయిల్‌ని రిసెప్షన్‌లో చూపించి, వాళ్ళు ఇచ్చిన తాళం చెవి తీసుకుని గదివైపు నడిచాడు.

"ఎంత బావుందండీ ఈ రూమ్?" సీత సంబరపడిపోయింది.

"బాత్‌రూం కూడా ఎంత బావుందో?" ఓ తలుపు తీసి చూసి చెప్పింది.

"అర్ధరాత్రయింది. మరి అందమైన రూమ్‌ని అనుభవిద్దాం రా" వాసు కవిత్వం ఒలకపోసాడు.

ఉదయం ఎనిమిదిన్నరకి మెలుకువ వచ్చింది సీత. బద్ధకంగా లేచి కిటికీ దగ్గరకి వెళ్ళి బయటకి చూసింది. కింద స్విమ్మింగ్ ఫూల్‌లో చాలామంది ఈదుతున్నారు. కొంతమంది ఒడ్డున సేద తీరుతున్నారు.

"ఈయన ఒప్పుకోలేదుకానీ ఇది ఫైవ్‌స్టార్ హోటలే" మనసులో కంగారుగా అనిపించింది.

బాత్‌రూంలోకి వెళ్ళి మొహం కడుక్కుని ఒకేసారి స్నానం చేసి బయటకి వచ్చి వాసుని లేపింది. కళ్ళు నులుముకుంటూ సెల్‌ఫోన్‌లోకి చూసి 'అమ్మో తొమ్మిదైంది' అని బాత్‌రూంలోకి పరిగెత్తాడు.

అతను స్నానమై వచ్చేసరికి సీత పట్టుచీర కట్టుకుని తయారై ఉంది. హడావిడిగా లాల్చీ, పైజమా వేసుకుని తాళం చెవి తీసుకుని చెప్పాడు. "పద పద. లేటవుతుంది."

"ఎందుకంత కంగారు? గుడి చాలాసేపు తెరిచే ఉంటుంది." సీత చెప్పింది.

"గుడికికాదు లేటయ్యేది. ఫ్రీ బ్రేక్‌ఫాస్ట్‌కి. పదిగంటలకల్లా క్లోజ్ చేస్తాం అని రాత్రి చెప్పారు"

"తిని వెళ్తామా? దర్శనమయ్యాక తినచ్చుగా?"

"ఇంకా నయం. తిరుమలలో తిని వెళ్ళట్లా?"

పొద్దున్నే వాదన ఎందుకని మౌనంగా అతని వెనక నడిచింది.

మీనాక్షి ఆలయం సమీపించే కొద్దీ జనసందోహం పెరుగుతూ వచ్చి, ఆలయప్రాంగణంలో ఇసకేస్తే రాలనంత మంది జనం కనిపించారు.

"ఇంతమంది జనాలేంటి?" అసహనంగా చెప్పాడు వాసు.

"వాళ్ళ భార్యల కోరికలు తీరుస్తున్నారేమో" సీత కిసుక్కున నవ్వింది.

ఆలయద్వారం దగ్గర ఆటో దిగి లోపలికి వెళ్ళారు. బయట వున్న వాళ్ళకి మూడురెట్లు లోపల ఉన్నారు. తొక్కిసలాట, తోపులాట వీరి ప్రమేయం లేకుండానే అమ్మవారి ముందుకి వెళ్ళడం, దణ్ణం పెట్టుకుని బయటపడటం జరిగిపోయింది. గర్భగుడిలోంచి బయటికి రాగానే వాసు ఆమె చెయ్యి పట్టుకుని లాగుతూ చెప్పాడు.

"పద. వచ్చిన దారినే వెళ్ళిపోదాం."

"దర్శనం తృప్తికరంగా లేదండి. ఇంకోసారి క్యూలో వెళ్దామా?" జుట్టు సరిచేసుకుంటూ అడిగింది.

"ఇంకా నయం. ఈ జనాన్ని చూస్తుంటే ఊపిరాడటంలేదు. పదపద."

"సరే. గర్భగుడిలోకి వెళ్ళద్దు కానీ మండపంలో శిల్పాలు చాలా బావుంటాయట. ఒక శిల్పంలా ఇంకోటి ఉండదట. మా చెల్లి చెప్పింది అది చూసి వెళ్దాం."

"నువ్వొక ఆర్కిటెక్ట్ నీ చెల్లెలొక ఆర్కిటెక్. పద" కసురుకున్నాడు.

"శిల్పసౌందర్యం చూడ్డానికి ఆర్కిటెక్ట్ అవ్వాలా?"

"సరే. నేను పోతున్నా. నువ్వు తీరిగ్గా చూసిరా" విసురుగా వెళ్ళిపోయాడు.

నిస్సహాయంగా అతన్ని అనుసరించింది.

బయట భోజనం చేసి రూంకి వెళ్ళారు.

"మనం ఇంత ఖర్చుపెట్టుకుని వచ్చినా అమ్మవారిని ఐదుక్షణాలు కూడా చూడలేకపోయాం. ఇవ్వాళంతా ఖాళీయేకదా. శ్రీరంగం ఇక్కడికి దగ్గరేట వెళ్దామా?" సీత ఆశగా అడిగింది.

"నీ తలకాయ. అది కర్ణాటకలో ఉంది."

"అది శ్రీరంగ పట్టణం అండి ఇది శ్రీరంగం."

"సరే. కనుక్కుంటాను" షర్ట్ వేసుకుని కిందకి వెళ్ళాడు.

ఐదు నిమిషాల్లో పైకి వచ్చి చెప్పాడు.

"ఇక్కడికి రెండు గంటల దూరమట. రెడీ అవు వెళ్దాం."

సీత ఆనందంగా లేచి చకచకా తయారైంది. కిందికి వచ్చాక టేక్సీ ఎక్కుతున్న భర్తని అడిగింది.

"బస్టాండ్ ఇక్కడికి దూరమా?"

"ఏమో ఎవరికి తెలుసు? మనం ఈ టేక్సీలోనే శ్రీరంగం వెళ్తున్నాం" వాసు విలాసంగా చెప్పాడు.

"ఇందులోనా? ఎంత?"

"రాను పోను రెండు వేలు."

సీత గుండెల మీద చెయ్యివేసుకుంది.

"మనం హోటల్ ఖాళీ చేసి వెళ్ళి శ్రీరంగంలో ఇవాళ రాత్రికి ఉండిపోయి, రేపొద్దున్నే వేలాంకణి చూసుకుని డైరెక్ట్‌గా ఏర్‌పోర్టుకి వెళ్ళేవాళ్ళం కదండి. ఫ్లయిట్ ఎప్పుడో మిడ్‌నైట్ కదా!"

"టూ నైట్స్‌కి ఈ హోటల్‌కి పేమెంట్ అయిపోయింది. శ్రీరంగం అన్నావు సరే. ఈ వేలాంకణేంటి?"

"మేరీమాత ఆలయం అండీ. దర్శనం చేసుకుంటే పిల్లలు పుడతారని."

"ఏం తల్లీ! హిందూమతంలోని ముక్కోటి దేవతలు చాల్లేదా? ఐనా పిల్లలు పుట్టడానికి ఇంకో సహజమైన మార్గం ఉంది." కన్ను గీటాడు.

సీత తలతిప్పుకుని కిటికీలోంచి చూస్తూండిపోయింది.

గంట ప్రయాణం తర్వాత డ్రైవర్‌కి తెలుగు తెలుసని తెలిసింది. సీత ధైర్యం తెచ్చుకుని అడిగింది.

"సుచీంద్రం ఎంతదూరమండి?"

"చాలా దూరమమ్మా. మూడుగంటలపైనే పడుతుంది." డ్రైవర్ చెప్పాడు.

"ఏమండీ రేపొద్దున్నే రూం ఖాళీ చేసి, సుచీంద్రం వెళ్ళి, అక్కడి నించి సరాసరి ఏర్‌పోర్ట్‌కి వెళ్దామా?" అలక మర్చిపోయి వాసుని అడిగింది.

"సుచీంద్రమా? అదేంటి? పార్శీల ఫైర్ టెంపులా?" వాసు జోకేసాడు.

"హిందూ టెంపులే. మన ఎదురు ఫ్లాట్ ఆవిడ అక్కడ పొర్లుదండాలు పెడితే, వాళ్ళమ్మాయికి మెడిసిన్ సీట్ వచ్చిందిట.."

"అర్థమైంది. నువ్వు పిల్లల కోసం దొర్లుతాను అంటావు. అంతేకదా. నావల్లకాదు. రేపంతా రెస్ట్."

వాసు సీటు వెనక్కి చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు.

శ్రీరంగం గుడి పరిసరాల్లోకి రాగానే వాసు వికారంగా మొహం పెట్టి చెప్పాడు.

"అబ్బా! ఎంతమంది బిచ్చగాళ్ళో చూడు. అసలు దేవుడుంటే ఈ బెగ్గర్స్ ఉండేవాళ్ళుకాదు తెలుసా?"

సీత అతని వంక చురుగ్గా చూసింది.

వాసు అయిష్టంగానే ఆమె వెనక నడిచాడు. పెద్దగా రష్‌లేదు. దర్శనం అవగానే మళ్ళీ తొందరపెట్టాడు.

"పద పద. చీకటి పడకుండానే వెళ్ళిపోదాం."

"ఉండండి. కావేరిని చూసి వెళ్దాం." విసుక్కుంది సీత.

"కావేరా? ఆవిడెవరు?"

తలమీద చిన్నగా కొట్టుకుని చెప్పింది.

"కావేరి నదండి."

"నదా? ఎక్కడుంది? ఎక్కడా కనపడలేదే? ఈ ఊరినించి వెళ్ళిపోయిందేమో."

"నది వెళ్ళిపోవడం ఏమిటండీ?"

"మన ఊళ్ళో చెరువుల్లో ఇళ్ళు కట్టడంలేదూ? అలాగే ఇక్కడ నదిలో కట్టి ఉంటారు." వాసు చప్పరించాడు.

"రంగనాథస్వామికి ఉభయ కావేరి మధ్యముడని పేరుట. ఆలయానికి రెండు వైపులా కావేరి ప్రవహిస్తుందని మా అమ్మ చెప్పింది.."

"మీ అమ్మకి, చెల్లికి నీకీ విజ్ఞానం నేర్పడం తప్ప వేరే పనేం లేదా? పద పద."

దాదాపు లాక్కుపోయాడు.

మర్నాడు చెకౌట్ టైంకి హోటల్లోంచి బయటకి వచ్చి ఏర్‌పోర్ట్‌కి బయలుదేరాడు వాసు.

"ఇప్పటినించే ఎందుకండీ. ఇంకోసారి గుడికి వెళ్ళి మీనాక్షమ్మని చూసి వెళ్దాం." ప్రాధేయపడుతూ అడిగింది సీత.

"ఇంకా నయం. నిన్న శనివారమే ఎంత జనాలో చూసావు. ఇవాళ ఆదివారం. ఇంకా డబుల్, త్రిబుల్ ఉంటారు. ఏర్‌పోర్ట్‌లో కూర్చుని వచ్చేపోయే వాళ్ళని చూస్తుంటే హాయిగా టైంపాసవుతుంది" నిరాకరించాడు.

"పోనీ ఎం.ఎస్ సుబ్బులక్ష్మి ఇల్లు చూసి వెళ్దామా? ఈ ఊళ్ళోనే ఉండేదట."

"నీకు జనరల్‌నాలెడ్జ్ ఎక్కువైంది కాని కాసేపు మాట్లాడకు."

సీత ఏర్‌పోర్టులో ఓ మూల కూర్చుని కూడా తెచ్చుకున్న నవలని తీసి చదవసాగింది. వాసు ఆ చిన్న ఏర్‌పోర్టులో నాలుగు రౌండ్స్ కొట్టి బోర్ కొట్టి భార్య దగ్గరకి వచ్చాడు.

పుస్తకంలోంచి తలెత్తి చూసి మృదువుగా నవ్వింది సీత.

"నేనోమాట అడుగుతాను. నిజంగా నిజం చెప్తారా?"

"ఏంటి?"

"మీకు భక్తిలేదు. ఆసక్తిలేదు. మరి ఇంత ఖర్చుపెట్టుకుని ఈ ప్రయాణం ఎందుకు ప్లాన్ చేసారు? ఏ ఊటీనో, సిమ్లానో వెళ్ళినా ఎంజాయ్ చేసేవాళ్ళవేమో?"

పట్టుబడ్డట్లుగా చూసి చెప్పాడు వాసు.

"రాఘవరావు వాళ్ళమ్మని శనివారం ఫ్లయిట్‌లో తీసుకొచ్చి అమ్మవారి దర్శనం చేయించి ఆదివారం వెనక్కి వచ్చేసాం అని గొప్పలు చెప్తున్నాడు. వాడేనా విమానాల్లో తిరిగేదని నేను మధురైకి టిక్కెట్లు కొన్నాను."

"హు. పోనీ ఢిల్లీకి కొనాల్సింది. ఎర్రకోట చూసేదాన్ని." నిట్టూర్చింది.

"సీతా. సీతా డార్లింగ్" నిద్రపోతున్న ఆమెని లేపాడు వాసు.

"అబ్బా! మీరు ఆఫీస్‌కి పొండి ఇవాళ కేంటిన్‌లో తినండి" విసుక్కుంది.

"అదికాదు. నీ దగ్గర బ్లాక్‌మనీ ఏమైనా ఉందా? బండిలో పెట్రోల్ లేదు. క్రెడిట్ కార్డ్ లిమిట్ అయిపోయింది ప్లీజ్. శాలరీ రాగానే ఇచ్చేస్తా." బతిమాలుతూ అడిగాడు వాసు.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments on this story